క్లుప్తంగా

మామిడిపల్లిలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం రేపు

దేవరాపల్లి: మండలంలోని మామిడిపల్లిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖ ర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. మంగ ళవారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్య క్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు పాల్గొని, వైఎస్సార్ విగ్ర హానికి పూలమాల వేసి నివాళులర్పిస్తార న్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల నుం చి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజ రుకావాలని కోరారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు


ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, పుష్పాలు, బంగారు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి కాలి నడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఉచితంగా ప్రసాదాలు, తాగు నీటిని భక్తులకు అందజేసింది.

అపూర్వ కలయిక


ఆత్మీయ కలయికకు హాజరైన పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు : గొండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన 25 మంది పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలతో సరదాగా గడిపారు. పూర్వపు విద్యార్థులు వి.గోవింద, దేముడు బాబు, అప్పారావు, సతీష్‌నాయుడు,తాతారావు, రాజశేఖర్, సత్యవేణి, భారతి, ఎర్రయ్యమ్మ, చెల్లయ్యమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ


బయపురెడ్డిపాలెం బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్

నర్సీపట్నం: నర్సీపట్నం నుంచి తుని వెళ్లే మార్గంలో బయపురెడ్డిపాలెం వంతెనపై కారు, బైక్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదం కారణంగా నర్సీపట్నం నుంచి తుని వెళ్లే వాహనాలు, తుని నుంచి నర్సీపట్నం వచ్చే వాహనాలు వంతెనపై నిలిచిపోయాయి. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు సుమారు 40 నిమిషాలు సమయం పట్టింది.

స్త్రీశక్తి పథకాన్ని వినియోగించుకోవాలి

చీడికాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకాన్ని మహిళలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు.ఆదివారం చీడికాడలో స్త్రీశక్తి పథకంపై మహిళలతో సమావేశం నిర్వహించారు. ముందుగా ర్యాలీ జరిపారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అమరత్వం' కవితకు పురస్కారం


కోరాడ అప్పలరాజును సత్కరిస్తున్న సాహితీ మిత్రులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర స్థాయి కవితల పోటీల్లో మండలంలోని కూడ్రం హైస్కూల్ తెలుగు మాస్టార్ కోరాడ అప్పలరాజు రాసిన కవితకు ఉత్తమ పురస్కారం లభించింది. మచిలీపట్నం సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో దేశభక్తి అంశంపై అమరత్వం శీర్షికతో రాసిన కవిత ఎంపికైంది. ఈ పోటీల్లో 300 మంది పాల్గొని తమ కవితలను ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అప్పలరాజును ఘనంగా సత్కరించి, ఉత్తమ బహుమతి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

భవనం సరే... వైద్యులేరి ?

- నేడు మాడుగులలో సీహెచ్‌సీ భవనం ప్రారంభం
- వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరు, 90 శాతం పనులు పూర్తి
- పూర్తిస్థాయిలో వైద్యులు లేక ఇక్కట్లు
- గైనిక్, డెంటల్ సమస్యలొస్తే అనకాపల్లి ఏరియా ఆస్పత్రే దిక్కు


మాడుగులలో ప్రారంభానికి సిద్ధమైన సీహెచ్‌సీ భవనం

మాడుగుల: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా మంజూరైన రూ.5.50 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే 90 శాతం నిర్మాణాలు పూర్తికాగా, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మిగిలిన కొద్దిపాటి పనులు పూర్తి చేశారు.

వెంటాడుతున్న వైద్యుల కొరత

ఈ ఆస్పత్రిలో ఎనిమిది మంది వైద్యులకు గాను ఐదుగురే విధులు నిర్వహిస్తున్నారు. ఇతర సిబ్బంది సుమారు 42 మంది ఉన్నారు. గైనకాలజిస్టులు ఎవరూ జాయిన్ కాలేదు. దంతవైద్యుడు జాయిన్ అయినా పీజీ చదువు కోసం సెలవు పెట్టి వెళ్లిపోయారు. జనరల్ ఫిజీషియన్‌గా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్ బదిలీపై వెళ్లిపోయారు. ఫిజియోథెరపీతో పాటు కంటి వైద్యనిపుణులు లేరు. ఫార్మసిస్ట్ గ్రేడ్-1 లేరు. దీంతో ఈ ఆస్పత్రిలో అంతంతమాత్రంగానే వైద్యసేవలందుతున్నాయి. ఆస్పత్రిని సుందరంగా తయారు చేశారు కాని, వైద్యులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో వ్యయప్రయాసలకోర్చి


శిథిలావస్థలో ఉన్న పాత ఆస్పత్రి భవనం

అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి గాని, ప్రైవేట్ ఆస్పత్రులకు గాని వెళ్లవలసి వస్తోందని మండల వాసులు తెలిపారు. వైద్యుల కొరత కారణంగా మాడుగుల, చీడికాడ మండలాలతో పాటు ఏజెన్సీతో కలిపి సుమారు 80 గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో గర్భిణులతో పాటు పలువురు వ్యాధిగ్రస్తులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించవలసి వస్తోంది. ప్రతి సోమవారం ఇక్కడ జరిగే వారపు సంత నాడు ఈ ఆస్పత్రికి ఏజెన్సీ నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. వైద్యులు లేకపోవడంతో వారు ఇబ్బందులకు పడుతున్నారు. ఈ ఆస్పత్రి భవనం ప్రారంభానికి వస్తున్న వైద్యారోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించి పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

30 మంది యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 30 యువకులు రక్తదానం చేశారు. సర్పంచ్ బొబ్బలరెడ్డి రమణ జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ అధ్యక్షుడు వాసు, నాయకులు భద్రాచలం, గవిరెడ్డి ప్రసాద్, బీసీ విభాగం అధ్యక్షుడు ఇటంశెట్టి శ్రీను, నాయుడు, గోపి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులను తొలగించాలి

సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన


డంపింగ్ యార్డ్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

రావికమతం: మండల కేంద్రం రావికమతంలోని పలు బహిరంగ ప్రదేశాల్లో డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి, చెత్తను నిల్వ ఉంచడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాంగి చంద్రయ్య, పాడి దన్నయ్యలు మాట్లాడుతూ స్థానిక అంబేడ్కర్ కాలనీ, హైస్కూలు, తహసీల్దారు కార్యాలయాల వద్ద చెత్త డంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వారం రోజుల్లో డంపింగ్ యార్డులను మార్చకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి శతనామ సంకీర్తన


కె.కోటపాడులో సత్యసాయి శతనామ సంకీర్తనను నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

కె.కోటపాడు : సత్యసాయిబాబా శతనామ సంకీర్తనా కార్యక్రమాన్ని కె.కోటపాడు రామాలయంలో కె.కోటపాడు సమితి కన్వీనర్ బండారు నారాయణ పాత్రుడు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన 100 మంది బాలలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలలకు సత్యసాయి సేవా సంస్థల తరపున బహుతులు అందజేశారు. బాల వికాస్ గురువులు బండారు రామలక్ష్మి, జేగురపాటి జ్యోత్స్న, సాయి శంకర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సేవాదళ్ ట్రైనింగ్ క్యాంప్ విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

దేవరాపల్లి: అనకాపల్లిలో సెప్టెంబర్ 7న నిర్వహించే జిల్లా సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు కోరారు. మండలంలోని పెదనందిపల్లిలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ సమావేశం జోనల్ ఇన్‌చార్జి రవిశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ వెయ్యి మంది సేవాదళ్ సభ్యులతో ట్రైనింగ్ నిర్వహించడం లక్ష్యమన్నారు. అనకాపల్లిలోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థాన సంఘానికి చెందిన గుంపిన సర్వేశ్వరరావు, అనుమాలిశెట్టి వెంకటరాజు కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో బాలవికాస్ శంకర్, శ్రీరామమూర్తి, కన్నబాబు, నాలుగు మండలాల భజన మండలి కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు


స్వామి వారి కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు


అల్లువారి వీధిలో నిర్వహించిన పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో జీవకారుణ్య సంఘం వద్ద ఏర్పాటు చేసిన మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివ మాల ధరించిన భక్తులు కీర్తనలు ఆలపించారు. అల్లు వారి వీధిలో నిర్వహించిన ఆటల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శెట్టిబలిజ వీధిలో నిర్వహించిన దీపారాధనలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. బండారు వీధి, కొండపాలెం గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు.


శెట్టి బలిజ వీధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


బండారు వీధిలో స్వామివారిని ఊరేగిస్తున్న స్థానికులు

శ్మశాన వాటికలోంచే పాఠశాలకు రాకపోకలు


శ్మశాన వాటికను దాటుకుంటూ కలిగొట్ల హైస్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

దేవరాపల్లి: మండలంలోని కలిగొట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్మశాన వాటికలోంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలకు వెళ్లే మార్గంలో రహదారికి ఆనుకొని శ్మశాన వాటిక ఉండటంతో విద్యార్థులు నిత్యం తీవ్ర భయాందోళనలతో రాక పోకలు సాగిస్తున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రహదారి లేక పోవడంతో మృతదేహాలను దహనం చేస్తున్న సమయంలో సైతం వాటి పక్క నుంచి వెళ్లాల్సి వస్తోంది. పాఠశాలలో సువిశాల ప్రాంగణం ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కలిగొట్ల హైస్కూల్‌కు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం


ముత్యాలమ్మపాలెంలో వినాయకుని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


కన్నంనాయుడు కల్లాలులో వినాయకుని దర్శించుకుంటున్న బూడి ముత్యాలనాయుడు


కేజే పురంలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి: గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా ఐక్యంగా నిర్వహించడం అభినందనీయమని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దేవరాపల్లి శివారు ముత్యాలమ్మపాలెం, కన్నంనాయుడు గారి కల్లాల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు చోట్ల వినాయకుని దర్శించుకుని పూజలు జరిపారు. ఆయా వినాయక కమిటీ సభ్యులు ముత్యాలనాయుడుకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అన్నసమారాధన నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరదపురెడ్డి లలితానాయుడు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, గండిపడాల అప్పలరాజు, వేచలపు అప్పలనాయుడు, చొక్కాకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్న సమారాధనలు

మాడుగుల రూరల్: వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం పలు గ్రామాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గల వినాయక ఆలయంలో , కేజే పురం కోమటి వీధి కాలనీ, ప్రధాన రహదారిలో మండపాల వద్ద అన్నసమారాధనలు జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండల కేంద్రం మాకవరపాలెంలో భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాయుపుత్ర యూత్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీకన్య థియేటర్ చెంత ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తామరం, మాకవరపాలెం, రాచపల్లి, రామన్నపాలెంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. బుచ్చన్నపాలెంలోనూ భారీగా అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.


మాకవరపాలెంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

గొలుగొండ: మండల కేంద్రం గొలుగొండలో వినాయక మండపం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. గొలుగొండ, జోగుంపేట, చిన్నయ్యపాలెం, కొత్తపాలెం, శ్రీరాంపురం తదితర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. రాత్రి వినాయక నిమజ్జనం నిర్వహించారు.

ప్రయాణం.. భయం భయం


నాతవరం వెళ్లే రోడ్డుకు ఇరువైపుల మొలిచిన పిచ్చి మొక్కలు


నర్సీపట్నం-తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డులో మార్జిన్ దిగలేని విధంగా పెరిగిపోయిన తుప్పలు, చెట్లు

- రోడ్లకు ఇరువైపులా భారీగా పెరిగిన పిచ్చిమొక్కలు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇక్కట్లు
- పలు రహదారుల్లో తరచూ ప్రమాదాలు

నాతవరం: మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణమంటేనే భయంగా మారింది. రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నర్సీపట్నం-తుని ఆర్అండ్ బీ రోడ్డుకిరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.సుమారు 18 కిలో మీటర్ల పొడవునా రోడ్డు మార్జిన్ దిగడానికి కూడా వీలు లేకుండా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈరోడ్డులో రాత్రి వేళ ప్రయాణించే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలకు సైడు ఇవ్వాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాండవ జంక్షన్ నుంచి నాతవరం వెళ్లే రోడ్డు, డి.యర్రవరం జంక్షన్ నుంచి జిల్లేడుపూడి, చెర్లోపాలెం వెళ్లే రోడ్డు, తాండవ ప్రాజెక్టు నుంచి నాతవరం, గుమ్మడిగొండ, పెదగొలుగొండపేట, చిక్కుడుపాలెం వెళ్లే అర్ అండ్‌బీ రోడ్లకు ఇరువైపుల పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. సరుగుడు, కె.వి.శరభవరం , ఊటమల్ల, తాళ్లపాలెం రోడ్లు సైతం అధ్వానంగా ఉన్నాయి. ఈరోడ్లలో ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

న్యాయం చేయకుంటే ఆందోళన తీవ్రతరం


మునగపాకలో ఆందోళన చేస్తున్న నిర్వాసితుల సంక్షేమ సంఘ సభ్యులు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే రానున్న రోజుల్లో తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగుతామని నిర్వాసితుల సంక్షేమ సంఘ సభ్యులు హెచ్చరించారు. నిర్వాసితులతో వీఎంఆర్‌డీఏ ఆటలాడుకోవడం తగదన్నారు. ఆదివారం మునగపాకలో సీఐటీయూ నేత బ్రహ్మాజీ మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్ట ప్రకారం బాధితులకు పరిహారం అందించాలన్నారు. టీడీఆర్ బాండ్లు కాకుండా నగదు నేరుగా అకౌంట్‌లో జమ చేయాలన్నారు. తక్కువ గడువిచ్చి అభ్యంతరాలు ఉంటే చెప్పాలని ప్రకటన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆడారి శ్రీనివాసనాయుడు, పెంటకోట అప్పలనాయుడు, విల్లూరి జగన్నాథరావు, బొడ్డేడ జగ్గారావు, పాలమరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

చీడికాడ: మండలంలోని ఖండివరం రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం,దేవతామూర్తుల బండ్ల వేషాలు ఆకట్టుకున్నాయి.వినాయకుడిని సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనువాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

అనకాపల్లి టౌన్: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక దొడ్డి రామానాయుడు భవనంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారని వాపోయారు. గ్రామాల్లోనే ఆశా కార్యకర్తలు విధులు నిర్వహించాల్సి ఉండగా, సబ్ సెంటర్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం తగదన్నారు. పెరుగుతున్న ధరలతో నేడు ఇస్తున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నాయని, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, దీనిని వెంటనే అమలు చేయాలన్నారు. బి. సత్యవతి, బి. రామలక్ష్మి, ఎం. సూర్యకళ పాల్గొన్నారు.